క్లుప్తంగా

భరిణికాంలో ఆంజనేయ ఆలయ ప్రతిష్టాపనోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం గోవిందపురం పంచాయతీ భరిణికాం గ్రామంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువత పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పొన్నాడలో వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలో మహాదన్ అగ్రిటెక్ లిమిటెడ్ సౌజన్యంతో బ్రెడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలుకు చెందిన వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్డియాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, జనరల్, గైనికాలజీ వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, గ్రామపెద్దలు సత్యనారాయణ, పాదిలాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన



శిక్షణ శిబిరానికి హాజరైన స్వచ్ఛంద కార్యకర్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలు, కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా చట్టాలపై అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ శుక్రవారం కొంగరాం గ్రామంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హాజరైన 120 మంది స్వచ్ఛంద కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ సంస్థ చైర్మన్ అంజలీ ఫిలిప్ ఆమోత మాట్లాడుతూ బాలల రక్షణకు ప్రవేశపెట్టిన చట్టాలు సమర్థంగా అమలుకావాలన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మిక నిషేధ చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు దేవి రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లేపల్లిలో సాయినాథుని విగ్రహ ప్రతిష్టాపన



పూజలందుకుంటున్న సాయినాథుడు

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లి గ్రామంలో గొరీస మేత మణినాగేశ్వరస్వామి దేవస్థానంలో సాయినాథుని యంత్ర ప్రతిష్ట విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అన్నదానం నిర్వహించారు. నిర్మాణదాత మూకళ్ల జయానంద్, దేవిక దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు మూకళ్ల శ్రీనివాసరావు, తాతబాబు, మాజీ ఎంపీపీ గొండు జగపతి, అంధవరపు సూరిబాబు, చిట్టి జనార్దన్‌రావు, నక్క తవిటినాయుడు, మూకళ్ల శ్రీదేవి, హైమావతి, గొర్లె రాజు, వాడాడ భీమారావు, గొద్దు సూరిబాబు, గుడ్ల శ్రీను, దుంగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో విశేష అభిషేకాలు



శ్రీకృష్ణ రుక్మిణీ ఉత్సవమూర్తులకు అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరంలో చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణ, రుక్మిణీ ఉత్సవమూర్తులకు మహాకుంభాభిషేకాలు జరిగాయి. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజు, పురందర దాసు, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. చైతన్య లీలలపై ఆధ్యాత్మిక ప్రవచనం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో లక్ష్మీగౌర్‌దాసు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మో.. ఆ 10 కిలోమీటర్లా..!



జాతీయ రహదారిపై గ్రిల్స్‌ను ఢీ కొట్టిన లారీ(ఫైల్)

- శ్రీకాకుళం సింహద్వారం- చిలకపాలెం హైవే మధ్య నిత్యం ప్రమాదాలు
- డివైడర్, గ్రిల్స్‌పైకి దూసుకెళ్తున్న వాహనాలు
- తాజాగా జరజాం జంక్షన్ కూడలిలో లారీని ఢీకొట్టి కారు
- ఆందోళనలో వాహనచోదకులు

శ్రీకాకుళం క్రైమ్ /ఎచ్చెర్ల క్యాంపస్ :

జిల్లాలో విస్తరించిన జాతీయ రహదారి మొత్తంలో ఆ 10 కిలోమీటర్ల రోడ్డు అంటేచాలు వాహనచోదకులు హడలిపోతున్నారు. సుమారు 15 నిమిషాల ప్రయాణంలో ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. బైక్‌లు డివైడర్లను ఢీకొట్టి ఎగిరెగిరి పడటం.. లారీలు వంటి భారీ వాహనాలు గ్రిల్స్ పైనుంచి దూసుకుపోయి విద్యుత్ స్తంభాలను నేల కూల్చేసి సర్వీస్‌రోడ్డుకి వచ్చి బోల్తాపడటం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పది రోజులకోసారి కనీసం ఒకసారైనా ఆ రోడ్డులో ప్రమాదం జరగడం సర్వ సాధారణ విషయమైపోయింది. ఇదీ శ్రీకాకుళం సింహద్వారం నుంచి చిలకపాలెం వరకు ఎన్‌హెచ్ 16 హైవేపై నిత్యం జరుగుతున్న రహదారి ప్రమాదాల దుస్థితి.



ఎచ్చెర్ల వద్ద బైక్‌ను ఢీకొట్టిన అంబులెన్సు(ఫైల్)

కారణాలేంటో?

- ఇసుక, గ్రావెల్ ట్రావెల్ చేసే ట్రాక్టర్లు, లారీలు అదుపు తప్పడం, అతివేగం కారణంగా రోడ్డు పైనే ఇసుక పేరుకుపోయేది. దాని కారణంగానూ వాహనాలు స్కిడ్ అవుతున్నాయి.
- ఈ మార్గాల్లో కొన్ని చోట్ల మలుపు మార్గాలు వక్రంగా ఉంటూ ఎత్తు పల్లాలుగా ఉండటం కూడా ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.



కేశవరావుపేట జాతీయ రహదారిపై ద్రాక్షపండ్ల లారీ వద్ద ఎగబడుతున్న జనం(ఫైల్)

ముఖ్యంగా ఫరీదుపేట కూడలి, సమీప హైవే, కింతలి మిల్లు జంక్షన్, ఎచ్చెర్ల కూడలి వద్ద ఈ పరిస్థితి నెలకొంది.

- చిలకపాలెం టోల్‌ప్లాజాల వద్ద డివైడర్లు ఎక్కేయడం, ఫరీదుపేట, ఎచ్చెర్ల వద్ద సర్వీస్‌రోడ్లు వైపు లారీలు వంటివి దూసుకుపోవడం వంటి ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోనే వరుసగా ఎందుకు ప్రమాదాలు జరుగుతున్నాయనేది తెలుసుకునేందుకు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే బాగుంటుందన్నది స్థానికులు అభిప్రాయపడుతున్నారు.
- అతివేగం, నిర్లక్ష్యానికి తోడు ఆగివున్న వాహనాలకు ఢీకొట్టడం, నిద్రమత్తు, మద్యం మత్తు వల్లే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని చాలామంది భావిస్తున్నారు.

ప్రమాదాల నివారణకు కృషిచేస్తాం..



రహదారి భద్రతలో భాగంగా చిలకపాలెం ఓల్డ్ ప్లాజా వద్ద చెకింగ్‌పాయింట్ పెట్టి వాహనాలను నిత్యం తనిఖీ చేస్తున్నాం. వారిని అవగాహనపరుస్తున్నాం. నిత్యం హైవే రోడ్ సేఫ్టీ ఆడిట్ జరుగుతునే ఉంటుంది. మరోసారి ఆ శాఖ డిప్యూటీ ఇంజినీర్‌తో మాట్లాడి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తాం. ప్రమాదాల నివారణకు కృషిచేస్తాం..

– ఎ.విజయసారథి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, శ్రీకాకుళం

ఇటీవలి ప్రమాదాలను పరిశీలిస్తే..

ఫిబ్రవరి 14: ఒడిశా రాష్ట్రం బాలాసూర్ కుర్ధానుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అభిషేక్ బెహరా (40) రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై తన భార్య అన్నయ్‌పార్థన్‌తో బెంగళూర్ లాంగ్‌డ్రైవ్ పయనం చేస్తూ.. నవభారత్‌నగర్‌కాలనీ సమీపంలో స్కిడ్ కావడంతో రహదారిపై పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన అభిషేక్ బెహరా రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. భార్య స్వల్ప గాయాలతో బయటపడింది.

ఫిబ్రవరి 27: విజయనగరం రామతీర్థాల పుణ్యక్షేత్రం దర్శించుకుని బైక్‌పై తిరిగొస్తున్న శ్రీకాకుళం నగరానికి చెందిన దంపతులు కుందు సూర్యారావు (56), సావిత్రిలను ఎచ్చెర్ల బైపాస్ వద్ద వెనుక నుంచి హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాల్ వెళ్తున్న అంబులెన్సు ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సూర్యారావు మరణించాడు. భార్య ఆరోగ్యం ఇప్పటికీ కుదురుకోలేదు.

ఫిబ్రవరి 26 : ఎచ్చెర్ల మండలం కింతలి మిల్లు సమీప జాతీయ రహదారి డివైడర్‌పైకి గ్రానైట్ లోడ్ లారీ దూసుకొచ్చింది. గ్రిల్స్ అన్నీ చెల్లాచెదురయ్యాయి. ఇంతకుముందు కూడా ఓ లారీ ఇదే ప్రాంతంలో గ్రిల్స్, డివైడర్‌ను ఢీకొట్టి సర్వీసు రోడ్డులో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. అదృష్టవశాత్తు క్లీనర్‌కు ఏం కాకపోయినా డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

మార్చి 8: ఎచ్చెర్ల పరిధి కేశవరావుపేట జాతీయ రహదారి వద్ద ద్రాక్షపండ్ల లారీ బోల్తాపడింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బండి దారికి అడ్డంగా పడిపోయింది. లారీలో ఉన్నవారికి స్వల్పగాయాలయ్యాయి.

మార్చి 14: జరజాం జంక్షన్ పై ఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొట్టటంతో ఆకాష్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు.

వైభవంగా డోలోత్సవం



గార: శ్రీకూర్మంలో డోలో మంటపం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గార: ఆది కూర్మక్షేత్రమైన శ్రీకూర్మనాథాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న కూర్మనాథుని డోలోత్సవం శుక్రవారంతో ముగిసింది. శ్రీకూర్మనాథాలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజస్వామి గజపల్లకి వాహనాలపై బయలుదేరి డోలో మంటపానికి చేరుకున్నారు. అప్పటికే సిద్ధం చేసిన ఊయలపై స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరనామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శ్వేతపుష్కరిణి, శ్రీకూర్మ–మత్స్యలేశం' సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు శ్రీకూర్మనాథాలయానికి చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, లక్ష్మణాచార్యులు, స్థానాచార్యులు శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు పాల్గొన్నారు. శ్రీకూర్మం ఉప సర్పంచ్ బరాటం జయలక్ష్మి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శ్రీకాకుళం నగర కమిషనర్ పీవీడీ ప్రసాదరావు స్వామివారిని దర్శించుకున్నారు.

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో డోలోపౌర్ణమి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళధ్వనుల నడుమ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో స్వామివారి ఉత్సవమూర్తులకు వెండి సింహవాహనంలో ఊరేగింపుగా మాడవీధుల నుంచి ఉద్యానవన తోట మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం డోలోపౌర్ణమి, హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోలికా రాక్షసి అంతమయ్యే వృత్తాంతాన్ని అర్చకులు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, సాందీప్ శర్మ, శ్రీహర్ష, ఫణీంద్ర శర్మ, బిన్నాడ నగేష్ శర్మ, రామకృష్ణ శర్మ, వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



అరసవల్లి: తిరువీధిగా వస్తున్న ఉత్సవమూర్తులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధిలో ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో డోలో మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో ఉత్సవమూర్తులను ఉంచి పూజలు నిర్వహించారు. మహిళా మండలి సభ్యులు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సర్వేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. నానుబాలవీధిలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులకు ఊయలలో ఉంచి వేడుకలు నిర్వహించారు.



శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో డోలోత్సవం పూజలు



గార: శ్రీకూర్మంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ బరాటం జయలక్ష్మి

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

హోలీ పౌర్ణమి, మహాలక్ష్మిదేవి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. కనుల పండువగా కల్యాణోత్సవాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో స్వామివారికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో భూనీల సమేత శ్రీనివాసుని కల్యాణం



శ్రీకాకుళం కల్చరల్: పూజలందుకుంటున్న సంతోషిమాత



ఎచ్చెర్ల: కుంచాల కూర్మయ్యపేటలో పూజలందుకుంటున్న అమ్మవారు

హోలీ.. రంగుల కేళీ



ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూ వసతి గృహంలో విద్యార్థినుల సందడి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలో హోలీ పండగను ప్రజలు ఆనందోత్సాహల మధ్య జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచే యువతీ, యువకులు వీధుల్లో తిరుగుతూ ఉత్సాహంతో రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. కలెక్టర బంగ్లా, పాత శ్రీకాకుళం, ఏడురోడ్ల కూడలి, గుడివీధి, పాలకొండ రోడ్డు, హయాతినగరం రెల్లివీధి, కొన్నావీధిలోని రాధాకృష్ణా నగర్ తదితర ప్రాంతాల్లో యువకులు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ సందడి చేశారు. పట్టణంలో సుమారు 150 కుటుంబాలు ఉన్న మార్వాడీలు ఒకేచోట చేరి హోలీ సంబరాలు జరుపుకొన్నారు. రాజస్థానీ మిలన్ మంచ్ ఆధ్వర్యంలో న్యూకాలనీలోని బాలాజీ అపార్ట్‌మెంటు వద్ద గురువారం రాత్రి హోలికా పూజలు చేశారు. శుక్రవారం ఉదయం ఎస్ఆర్ఎంట కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో టెంట్లు ఏర్పాటు చేసి రంగులు జల్లుకుంటూ వేడుకలు జరుపుకొన్నారు.కార్యక్రమంలో రాజేంద్ర కర్నాని, బాబూలాల్, మనోజ్, అమిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, చిలకపాలెంలోని శివానీ కళాశాల, ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల, శ్రీకాకుళం పురుషుల, మహిళల పాలిటెక్నిక్ వసతి గృహాల్లో విద్యార్థులు రంగులు పూసుకొని సందడిగా హోలీ వేడుకలు జరిపారు.



శ్రీకాకుళంలో రంగులు జల్లుకుంటున్న మార్వాడీలు

జి.సిగడాం: మండలంలోని సీతంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం చిత్తిరి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు స్రవంతి, ఎం.కుమార్, జగదీష్‌ల నేతృత్వంలో విద్యార్థులు వేషధారణలతో అలరించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం లింగాలవలసలో హోలీ సంబరాలు సందడిగా సాగాయి. ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



జి.సిగడాం: హోలీ సందర్భంగా విద్యార్థుల వేషధారణ



శ్రీకాకుళంలో హోలీ సంబరాల్లో మార్వాడీ మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: గాయత్రీ అపార్టుమెంట్ వద్ద చిన్నారుల సందడి



శ్రీకాకుళం కల్చరల్: రెల్లివీధిలో రంగులు జల్లుకుంటున్న యువకులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో హోలీ వేడుకల్లో చిన్నారులు



ఎచ్చెర్ల: లావేరు మండలం లింగాలవలసలో..

సంక్షిప్తంగా..


రెవెన్యూ ఉద్యోగుల వైద్య శిబిరం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆధునీకరించిన రెవెన్యూ భవనాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ రామిశెట్టి వెంకటరాజేష్, జిల్లా రెవెన్యూ అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

రేపు రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో రంగనాథస్వామి ఆలయం 27వ వార్షికోత్సవం ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, అనంతరం భారీ అన్నదానం నిర్వహిస్తామని, భక్తులంతా తరలిరావాలని కోరారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: హయాతినగరంలోని సత్యసాయి భజన మండలి 23వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మందిర కన్వీనర్ కిల్లాన ఫల్గుణరావు, కొర్నాన వెంకటరావు ఆధ్వర్యంలో భజన పాటలు, బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, అమృత కలశాల పంపిణీ జరిగాయి.

ఘనంగా రామాలయ ప్రతిష్టాపనోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: బలగలో రామాలయ పునర్నిర్మాణ ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహం తరహాలో ఇక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విశేష హోమాలు, పూర్ణాహుతి, స్థిర యంత్ర ప్రతిష్ట మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న కంప్యూటర్ ఇంటర్నల్ ఫెస్ట్



స్టాళ్లను పరిశీలిస్తున్న అతిథులు, నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అక్షి–టూకే25 పేరిట కంప్యూటర్ ఇంటర్నల్ ఫెస్ట్ నిర్వహించారు. టెక్కలి ఐతమ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ డాక్టర్ యు.డి.ప్రసన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వీపి కె.వేణు, కంప్యూటర్స్ హెచ్ఓడీ ఎల్.ప్రసాదరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.